
Cover Page

DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in

# తెలుగు పాఠక స్మృతిపథంలో విశ్వకథావేదిక-విపుల

**డా.జె.నీరజ**

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ

ప్రభుత్వ సిటీ కాలేజి, హైదరాబాద్

**వ్యాస సంగ్రహణం:** 'విపుల' మాసపత్రిక తెలుగు సాహిత్య పత్రికారంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా ఒక చారిత్రాత్మక బాధ్యతను నిర్వర్తించి విశిష్టమైన స్థానం సంపాదించింది. 1978లో 'ఈనాడు' సంస్థ నుండి ప్రారంభమై, 2021 వరకు కొనసాగిన ఈ పత్రిక, తెలుగు కథలతో పాటు భారతీయ, ప్రపంచ భాషల కథల అనువాదాల ద్వారా సాంస్కృతిక వైవిధ్యాన్ని, రాజకీయ చైతన్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసి అభిరుచి, అధ్యయన విస్తృతిని పెంచింది. 'విశ్వ కథావేదిక' నినాదంతో, వస్తు, శైలీ వైవిధ్యం కలిగిన కథలను అందించి, రచయితలు, పాఠకులను ఆలోచనాత్మకంగా ప్రేరేపించింది. 'కథకుల ఫైల్', 'విశ్వ కథాముత్యం', 'ఆప్తవాక్యం', 'పరామర్శ' వంటి శీర్షికలు సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షల ద్వారా పాఠకులకు లోతైన అవగాహన కల్పించాయి. 'వందేళ్ళ తెలుగు కథ' సందర్భంగా ప్రముఖ విమర్శకుల వ్యాసాలు, తెలంగాణ, దళిత కథల విశ్లేషణలు సాహిత్య చరిత్రను సమగ్రంగా అర్థం చేసుకునేందుకు దోహదపడ్డాయి. తెలుగు కథలో ఉద్యమ చైతన్యం, సామాజిక మార్పులను ప్రతిబింబించిన విపుల, సాహిత్య సేవలో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది.

**కీలక పదాలు:** విపుల మాసపత్రిక, తెలుగు సాహిత్యం, విశ్వ కథావేదిక, కథల అనువాదం, సాంస్కృతిక వైవిధ్యం, రాజకీయ చైతన్యం, సాహిత్య విమర్శ, పుస్తక సమీక్ష, వందేళ్ళ తెలుగు కథ, ఉద్యమ చైతన్యం, సాహిత్య సేవ.

తెలుగు పత్రికా వ్యవస్థ ప్రస్థానం 19వ శతాబ్దంలో ప్రారంభమైంది. డా.జి.ఎన్.రెడ్డి గారి పరిశోధనను అనుసరించి 1832లో ప్రచురితమైన 'కర్నాటిక్ క్రానికల్' తొలి తెలుగు పత్రిక. ఆ తరువాత 1838లో మండిగల వెంకటరాయశాస్త్రి సంపాదకీయంలో వెలువడిన 'వృత్తాంతిని' అనే వారపత్రిక గురించి ఆరుద్ర ప్రస్తావించారు. అటు తరువాత వచ్చిన చాలా పత్రికలు ఎక్కువకాలం ప్రచురణలో లేవు. వివేకవర్ధని పత్రిక 1874లో మాసపత్రికగా ప్రారంభమై, వారపత్రికగా మారి రెండు దశాబ్దాలు సాంఘిక, రాజకీయ విషయాలలో సేవ చేసిందని ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువడిన 'తెలుగులో వార, మాస పత్రికలు'లో డా.వేదగిరి రాంబాబు రాస్తారు. 1880ల నుండి మద్రాసు నుండే కాక, ఆంధ్ర ప్రాంతంలోని పలు ప్రదేశాల నుండి తెలుగు పత్రికలు వందల సంఖ్యలో పుట్టుకొచ్చాయి కానీ దీర్ఘకాలం నడిచినవి చాలా తక్కువ. పత్రికలు వేగంగా వెలుగు చూసి అంతే వేగంగా మూతబడుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ తొలినాటి

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page
DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

గ్రంథాలయోద్యమ ప్రముఖుల్లో ఒకరైన మల్లెల శ్రీరామమూర్తి, 'పత్రికలన్నీ ఒక మూసలో ఉండకుండా వివిధ రంగాలకు చెందిన విశేషాలను ప్రచురిస్తూ ఒకరికొకరు పోటీ కాకుండా ఉండాలని తద్వారా తమ అభిరుచుల కనుగుణంగా చందాదారులు లభిస్తార'ని 1941లో త్రిలిఙ్గ పత్రిక రజతోత్సవ సంచికలో రాసారు. బ్రిటిష్ పాలనా కాలంలో పత్రికలు ప్రజానీకంలో స్వేచ్ఛాకాంక్షను రగిలించి, సంఘటితం చేయటంలో సఫలమయ్యాయి. జాతీయోద్యమంలో సాహిత్య పత్రికలు కీలక పాత్ర పోషించాయి, ప్రజలలో స్వాతంత్ర్య భావనను రగిలించి, సామాజిక చైతన్యాన్ని ఉద్యమస్థాయిలో పెంపొందించాయి. అవి సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, వివిధ సంప్రదాయాలు, భాషలు, ఆలోచనలను ఒక వేదికపైకి తెచ్చాయి. ఈ పత్రికలు సాహిత్య సృజన ద్వారా పాఠకులలో ఆలోచనా స్వేచ్ఛను, సామాజిక సమస్యలపై అవగాహనను పెంచాయి. విభిన్న రచనల ద్వారా సమాజంలో ఐక్యత, సాంస్కృతిక స్ఫూర్తిని నింపడంలో ఈ పత్రికల కృషి అమూల్యమైనది. స్వాతంత్ర్యానంతరం భారతీయ భాషలన్నిటా వివిధ దిన, వార, మాస, త్రైమాస పత్రికలు కేవలం వార్తా పత్రికలుగానే కాక విషయ ప్రాధాన్యతను అనుసరించి ప్రత్యేక పత్రికలుగా వెలువడుతున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం నుండీ తెలుగునాట కృష్ణా, ఆంధ్ర పత్రిక, గోలుకొండ మొ॥ పత్రికలు కేవలం వార్తాపత్రికలుగానే కాక సాహిత్యాంశాలకు కూడా ప్రాధాన్యతను కల్పించాయి. రాజకీయ భావప్రసారం ప్రధానంగా సాగే దినపత్రికలు కూడా గత నాలుగు దశాబ్దాలుగా సాహిత్యరంగానికి సముచితమైన స్థానమిస్తున్నాయి. అయితే వార, మాస పత్రికలు సాహిత్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు కనిపిస్తున్నా ఆయా పత్రికల్లోని కథలు, విమర్శావ్యాసాలు, ఇతర సారస్వత సంబంధిత శీర్షికలు ఏ మేరకు సాహిత్యసేవగా పరిగణించవచ్చనేది ఎప్పుడూ ప్రశ్నార్థకమే! అందునా చాలా పత్రికలు పాఠక జనాదరణ తగ్గటం, వాణిజ్యపరంగా లాభసాటిగా లేకపోవటం చేత క్రమంగా కనుమరుగవుతున్నాయి. విశ్వ కథావేదిక'నినాదంతో నాలుగు దశాబ్దాలకు పైగా విశ్వ కథాసాహిత్యానికి, సద్విమర్శకు రీతులలో సాహిత్య విమర్శకు ఆలంబనగా నిలిచి సేవలందించిన మాసపత్రిక 'విపుల' అలా కనుమరుగైన పత్రికలలో ఒకటి.

తెలుగు వార్తా పత్రికా రంగంలో గణనీయమైన అనుభవం గడించిన 'ఈనాడు' సంస్థ నుండి 1978 లో ప్రారంభించబడి 2021 మార్చి సంచికతో ఆగిపోయిన పత్రిక 'విపుల' మాసపత్రిక. కేవలం తెలుగు కథలనే కాక ఇతర భారతీయ భాషల కథలు, ప్రపంచ భాషలలో ప్రఖ్యాతులైన వారి కథల తెలుగు అనువాదాలతో విశ్వకథకు వేదికగా భాసిల్లింది. వివిధ భాషల కథల ద్వారా భిన్న ప్రాంతాల జీవన చిత్రాలను, సాంస్కృతిక వైవిధ్యాన్ని, రాజకీయ చైతన్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసింది. వస్తు, రూప, శైలీ వైవిధ్యం కలిగిన కథలను అందించి పఠితలను, రచయితలను ఆలోచింపజేసింది. తెలుగు కథకుల అనువాద కౌశలానికి కూడా ఈ అనువాద కథలు అద్దంపట్టాయి. 'విపుల' కేవలం కథాప్రచురణే

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page
DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

కాక వివిధ శీర్షికలతో సంపూర్ణ సారస్వత మాస పత్రికగా విజ్ఞులైన పాఠకులను అలరించింది. వివిధ విమర్శా వ్యాసాలు, పరామర్శ, కథకుల ఫైల్, ఆప్త వాక్యం, పుస్తక సమీక్ష, ఈ కథ మీదే, విశ్వ కథామృత్యం వంటి అనేక శీర్షికల ద్వారా వివిధ సాహిత్యాంశాలను పాఠకులకు అందించింది.

1910 లో దిద్దుబాటుతో ప్రారంభమయిన ఆధునిక తెలుగు కథానికా ప్రయాణం నూరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'విపుల' ప్రముఖ విమర్శకుల వ్యాసాలు ప్రచురించింది. 'వందేళ్ళ తెలుగు కథ' పేరుతో పలు అంశాలపై పరిశోధనా పత్రాలనదగిన వ్యాసపరంపరను వెలువరించింది. విశ్వవిద్యాలయాలలో వివిధ సాహిత్యాంశాలపై పరిశోధన సాగించిన విద్యార్థులకు ఈ వ్యాసాలు ఎంతో ఉపకరించాయి. అల్లం రాజయ్య 'ఉద్యమాలతో పురుడు పోసుకున్న తెలంగాణ కథ', డా.కొలకలూరి మధుజ్యోతి 'దళిత ఆత్మ స్వరూప ఆవిష్కరణ', 'మల్లాది వెంకట కృష్ణమూర్తి' ప్రత్యేక సంచికలతో తెలుగు కథకు ఉత్తేజం', మధురాంతకం నరేంద్ర 'ప్రపంచీకరణ ప్రభావం- తెలుగు కథ' వంటి విలువైన వ్యాసాలు గత శతాబ్దంలో కాలంలో పాటు వస్తువు, శిల్పంలో వచ్చిన మార్పును విశ్లేషించాయి. ప్రజాస్వామిక ఆకాంక్షలను అక్షరబద్ధం చేసి తెలుగు రచయితలు ప్రజల పక్షం నిలబడ్డారు. వాదాలు, ఉద్యమాలు నేపథ్యంలో తెలుగు కథ నిత్యనూతనంగా తనను ఆవిష్కరించుకుంది.

అల్లం రాజయ్య తన వ్యాసంలో 'సంప్రదాయ ఆధిపత్య ధోరణుల వల్ల తెలంగాణ కథకు మొదటి నుండి ప్రచారం తక్కువ'నే అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యాసకర్త తన పరిశీలనలో, వివిధ దశలలోని ఉద్యమాలతో మమేకమైన తెలంగాణ జీవితాన్నే రచయితలు కథా వస్తువుగా గ్రహించినట్లుగా గుర్తించారు. అందువలన తెలంగాణ కథలలో ఉద్యమ వాతావరణం కనబడుతుందని అంటారు. తొలి తరం కథకులు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి రంగాచార్య, స్వయంగా ఉద్యమ భాగస్వాములై నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న విషయాన్ని ప్రస్తావించారు. నవీన్, చెరబండరాజు, బోయ జంగయ్య, నిఖిలేశ్వర్, చంద్ర వంటి మలితరం కథకులు సమకాలీన రాజకీయ సామాజిక స్థితిగతులు, తెలంగాణ సమాజ అస్తిత్వ వేదన చుట్టూ కథలల్లినట్లు రాజయ్య తన వ్యాసంలో పేర్కొన్నారు. తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన వాదాలకు నవతరం తెలంగాణ కథకులు ప్రాంతీయ చైతన్యం తో స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. 'దళిత కథకుల కథారచన చేత వస్తు స్వీకరణ, కథానిర్వహణ, పరిష్కార నిరూపణ చైతన్యవంతంగా సాగింద'ని డా.మధుజ్యోతి తమ వ్యాసంలో వెల్లడించారు. 'వివిధ వార, మాస పత్రికలు కథల పోటీలు నిర్వహించి, భిన్న సందర్భాలలో ప్రత్యేక సంచికలు వెలువరించి ఉత్తమ కథాసాహిత్య సృష్టికి తోడ్పడ్డాయ'ని పాపులర్ రచయిత మల్లాది తమ వ్యాసంలో పేర్కొన్నారు. 'మృగ్యమై పోతున్న మానవ విలువలు, ఉనికిని కోల్పోతున్న కులవృత్తులు, మార్కెట్ దోపిడికి గురవుతున్న జీవితాలపై

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page
DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

డా.వి.చంద్రశేఖరరావు, కుప్పిలి పద్మ, సుంకోజి దేవేంద్రాచారి, అట్టాడ అప్పల్నాయుడు, పెద్దింటి అశోక్ కుమార్ రాసిన కథల గురించి విలువైన విశ్లేషణను అందించిన మధురాంతకం నరేంద్ర ప్రపంచీకరణ నేపథ్యంలో వెలువడిన తెలుగు కథ వాస్తవ జీవితాన్ని చిత్రించింద'ని అభిప్రాయపడ్డారు.

విపుల నిర్వహించిన విశిష్ట శీర్షిక 'కథకుల ఫైల్'. తెలుగు కథకులను వారి విశిష్ట కథానిక ప్రచురణ ద్వారా మరోసారి పరిచయం చేస్తూ, ఆయా కథలపై వర్తమాన రచయితలు, విమర్శకుల స్పందనను కూడా జోడించారు. జూలై 2010 సంచికలో గురజాడ 'మెటిల్డా' కథతో ప్రారంభమైన ఈ శీర్షిక ద్వారా సురవరం ప్రతాపరెడ్డి 'వకీలు వెంకయ్య', రావూరు వెంకట సత్యనారాయణ 'మధు పర్కాలు', క్రొవ్విడి లింగరాజు 'గొప్పోళ్ళ న్యాయం', తెన్నేటి సూరి 'బూరె ముక్కలు' వంటి కథలను అందించారు. 'మధుపర్కాలు' కథపై తన వ్యాఖ్యానంలో 'గొప్ప కథ కాలావధుల్ని దాటి బ్రతుకుతుంది. గొప్ప సాహిత్యానికి అన్వయలక్షణం ఉంటుంద'ని ప్రముఖ కవి, విమర్శకుడు కె.శివారెడ్డి వ్యాఖ్యానించారు. పరస్పర విరుద్ధాంశాలను చూపిన ప్రత్యేక కథగా 'బూరెముక్కలు' కథను విశ్లేషించారు ప్రముఖ విమర్శకులు కాత్యాయనీ విద్మహే. నవతరం పాఠకులు ఈ శీర్షిక ద్వారా తొలి తరం కథలను చదవటమే కాక ప్రముఖుల విమర్శను పరిశీలించటం చేత కథను విశ్లేషించే తీరు కూడా అర్థం చేసుకుంటారు. ఈ శీర్షికను చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు రచయిత, పరిశోధకుడు డా.వేదగిరి రాంబాబు.

విపుల నిర్వహించిన మరో విశిష్ట శీర్షిక'విశ్వ కథాముత్యం'. విశ్వసాహిత్యంలో మైలురాళ్ళు అనదగిన కథలను తిరిగి ముద్రించి, కథతో పాటు రచయితల గురించి సాధారణ పాఠకలోకానికి తెలియని ఎన్నో విశేషాంశాలను అందించారు. ప్రేమలో కొత్త కోణాలను ఆవిష్కరించిన కథలుగా గోర్కీ 'ప్రేమలేఖలు', గైది మపాసా 'ప్రియురాలి హృదయం', కుప్రీన్ 'రాళ్ళ వంకీ', తుర్గెనేవ్ 'ముమూ' మొదలైన కథలు ఈ శీర్షికలో చోటు చేసుకున్నాయి. ఈ కథనాలు చదివితే రచయిత జీవిత, సాహిత్యనేపథ్యాలు వారి రచనలపై ఎలాంటి ప్రభావం చూపాయో అర్థమవుతుంది. తన కథనాలతో జార్ ప్రభుత్వాన్ని వణికించిన గోర్కీ పేదల పక్షపాతిగా కథారచన చేసి తరువాతి తరాలకు మార్గదర్శకుడిగా నిలిచాడు. స్త్రీ హృదయావిష్కరణలో దిట్ట అనిపించుకున్న మపాసా కథలు అన్ని ప్రపంచ భాషలలోకి అనువాదమయ్యాయి. ప్రపంచ సాహిత్యాన్ని పునరావలోకనం చేసేందుకు దోహదపడిందీ శీర్షిక.

'వందేళ్ళ తెలుగుకథ' నేపథ్యంలో విపుల నిర్వహించిన మరొక వినూత్న శీర్షిక 'ఆప్తవాక్యం'. నూరు వసంతాల తెలుగు కథా వైశిష్ట్యాన్ని ప్రముఖ తెలుగు రచయితలు, విమర్శకుల నుండి సేకరించి వెలువరించారు. డా.కేతు విశ్వనాథరెడ్డి, మునిపల్లె రాజు, పెద్దింటి అశోక్ కుమార్, అబ్బూరి ఛాయాదేవి, కాలువ మల్లయ్య వంటి విశిష్ట కథకులు తెలుగు కథ తీరు తెన్నులను విశ్లేషించారు. 'తెలుగు మౌఖిక కథకు

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in

DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉంద'న్న కేతు విశ్వనాథరెడ్డి అభిప్రాయానికి సమాంతరంగా 'వేల సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో అద్భుతమైన కథలున్నాయని' అభిప్రాయం వ్యక్తం చేశారు మునిపల్లె రాజు. తెలుగు సామాజిక జీవితంలో వచ్చిన అనేక మార్పులను మన కథకులు చాలా నిశితంగా పరిశీలించారని, కథారచనలో దానిని ప్రతిభావంతంగా దృశ్యమానం చేశారని విమర్శకులు ఏకీభవించారు.

విపుల మాసపత్రిక అందించిన విశిష్ట శీర్షిక 'పరామర్శ'. ప్రతి సంచికలో ప్రచురించే కథలపై వివిధ రంగాలలో ప్రముఖులైన వారి స్పందనను పరామర్శ పేరుతో పాఠకుల ముందుంచిందీ శీర్షిక. వివిధ కథలపై, శీర్షికలపై ప్రముఖులు చేస్తున్న సునిశిత విమర్శ పత్రిక విలువను పెంచింది. విజ్ఞులైన పాఠకులను కేవలం కథాపఠనంతోనే సంతృప్తిపరచక ప్రముఖ విమర్శకుల స్పందనతో పత్రిక విలువలను గణనీయంగా పెంచుకున్నది విపుల. పాఠకులు ఈ పరామర్శ ద్వారా కథను చదవటం, విమర్శక దృక్పథంతో అర్థం చేసుకోవటంతో పాటు తాము చదివిన కథలపై మరుసటి నెలలో ప్రచురించే 'పరామర్శ' ద్వారా మరోసారి కథను చదివే తీరును నేర్చుకునేందుకు అవకాశం లభించింది. 'పుస్తక సమీక్ష' పుస్తకానికీ, పాఠకునికీ మధ్య వారధి లాంటిది. ఉత్తమ విమర్శకుని సమీక్ష ఆ గ్రంథం పట్ల పాఠకునికి అవగాహన కల్పించి, ఆసక్తిని జనింపచేస్తుంది. విపుల మాస పత్రిక ప్రతి నెల నిర్వహించిన ఈ శీర్షికలో ప్రతి నెల కనీసం నాలుగైదు కొత్త పుస్తకాలపై అందించిన సమీక్షలు గ్రంథ ప్రాముఖ్యతను, సమీక్షకుని నేర్పును కూడా పాఠకులకు పరిచయం చేసింది. విపుల ప్రత్యేక తెలుగు హాస్య, వ్యంగ్య కథల సంచిక, తెలుగు కథల ప్రత్యేక సంచిక వెలువరించటం తన ప్రయోగపరంపరలో భాగమని విపుల, చతుర జంట పత్రికల సంపాదకుడిగా పనిచేసిన యార్లగడ్డ రాఘవేంద్రరావు తన అనుభవాలలో రాసుకున్నారు. 'ఇంద్రధనస్సు', 'చేరాకాలమ్', 'సైన్స్ ఫిక్షన్', 'నోబెల్ కథలు' వంటి శీర్షికల ద్వారా తెలుగు, తెలుగేతర సాహిత్యాన్ని అందిస్తూ నిరంతరం పాఠకులకు ఆసక్తిని, జిజ్ఞాసను తీర్చే ప్రయత్నం చేశారు సంపాదకులు.

విపుల కథలలోని వస్తువు రచయితల కాలిక స్పృహను, సామాజిక బాధ్యతను వ్యక్తీకరిస్తుంది. విశ్వజీత్ వెనర్జీ రచించిన జార్ఖండ్ కథ 'నష్ట పరిహారం' ప్రభుత్వ విధానాలలోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తుంది. దేశంలో అణు విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపనకు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు, దుర్వినియోగం అవుతున్న వేల కోట్ల నిధులు, కాలయాపన కమిటీల నగ్న స్వరూపాన్ని చాలా సరళశైలిలో అందించాడు రచయిత. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల పనితీరును వ్యంగ్యంగా చిత్రించిన పోర్చుగీసు కథ 'ఓ చీమ కథ'. మానవ సమాజం 21వ శతాబ్దంలో కూడా కులకోరల్లోనే చిక్కుకుని ఉందని నిరూపించిన కన్నడ కథ 'తేడా', పేదలకి, ధనికులకి జరిగే నిత్య సంఘర్షణ ఒక పసిమనసును కాల్చేసిన ఇతివృత్తంతో సాగిన కథ 'రోడ్లె బడ్డ తల్కాయలు'.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed Journal
Volume:13, Issue:3(1), March: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd March 2024 : Date of Publication:30th March 2024
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page
DOI: http://ijmer.in.doi./2024/13.3.20.3.104

రాశిలో తక్కువైనా వాసిలో విశిష్ట పాఠకజనాన్ని సంతరించుకున్న పత్రికగా విపుల తన వైశిష్ట్యాన్ని కాపాడుకున్నది. నిజానికి పత్రికారంగంలోనే 'విపుల' ప్రచురణ ఒక ప్రయోగం. ఏకకాలంలో వివిధ భాషల కథలు చదవటం, వాటిని తులనాత్మకంగా పరిశీలించటానికి విపుల అవకాశం కల్పించింది.1979 జూన్ నెల జ్యోతి మాసపత్రికలో వెలువడిన కొడవటిగంటి కుటుంబరావు 'సాహిత్యమూ - పత్రికలూ' వ్యాసంలో 'ఈ కాలంలో వచ్చే మంచి సాహిత్యం, ముఖ్యంగా కల్పనా సాహిత్యం - ఒక్క శాతమే అనుకున్నా, దాదాపు అది అంతా పత్రికల ద్వారానే వచ్చింద'ని అన్నారు. కానీ పత్రికా పఠనం పట్ల ఆసక్తిని పోగొట్టుకున్న తెలుగు పాఠకుల వలన ఎన్నో పత్రికలు కాలగర్భంలో కలసిపోయాయి. ఈనాడు సంస్థ నుండి విపులతో పాటు వెలువడిన చతుర, నాలుగు దశాబ్దాలు తెలుగు పాఠకలోకానికి అత్యుత్తమ నవలాసాహిత్యాన్ని అందించి పాఠకులకు ఒక మధుర పఠన జ్ఞాపకంగా మిగిలింది. ఆ తరువాతి కాలంలో ఇదే సంస్థ నుండి వెలువడిన తెలుగు వెలుగు, బాలభారతం కూడా పాఠకాదరణ కరువై ప్రచురణ నిలిచిపోయింది. ఒక సాహిత్య పత్రిక విలువ అది ఆగిపోయినప్పుడే అర్థమవుతుంది. దానివల్ల సమాజం ఎంతగా ప్రభావితమయ్యిందో తెలిసివస్తుంది. 'విపుల' మాస పత్రిక అలాంటి అమూల్యమైన అధ్యయన అనుభవం అందించింది.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. విపుల మాసపత్రిక సంచికలు
2. కొడవటిగంటి కుటుంబరావు 'సంస్కృతి వ్యాసాలు'
3. తెలుగులో వార, మాస పత్రికలు- డా.వేదగిరి రాంబాబు, 2012, తెలుగు అకాడమీ
4. తెలుగు పత్రికల సాహిత్యసేవ- డా.తిరుమల రామచంద్ర, 1989, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్